నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 25 అక్టోబర్ 2024 | HYDERABAD

# కొలువుంది.. మరి బాధ్యతలేవీ!?

**జీహెచ్ఎంసీలో కొత్త ఇంజినీర్లకు చుక్కెదురు!**

**రిపోర్టు చేసి రెండు వారాలు గడిచినా దక్కని బాధ్యతలు**

సిటీబ్యూరో, అక్టోబరు 24 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీలో ఇంజినీర్లకు కొత్త కొలువు కష్టాలు వచ్చి పడ్డాయి. ప్రభుత్వ కొలువు.. అందులో హైదరాబాద్ పౌరులకు సేవలందించే కీలకమైన బల్దియాలో పోస్టింగ్ వచ్చిందంటూ సంబురపడిన ఏఈఈలకు నిరాశే ఎదురవుతున్నది. రాష్ట్ర వ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు 146 మంది ఏఈఈలు కొత్తగా నియామకం కాగా, ఇందులో జీహెచ్ఎంసీకి 112 మంది ఏఈఈలు ఈ నెల మొదటి వారంలో రిపోర్టు చేశారు. ఐతే, రెండు వారాలు గడిచినప్పటికీ వీరికి ఇప్పటి వరకు బాధ్యతలు అప్పగించలేదు. ప్రాజెక్టు, నిర్వహణలో కొరత ఉందని చెప్పిన యంత్రాంగం, ఖాళీలను వీరితో భర్తీ చేయడంలో తాత్సారం చేస్తున్నది. దీంతో 'ఓ స్త్రీ రేపు రా' అన్నట్లుగా రోజూ బాధ్యతల అప్పగింతపై ఏఈఈలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉన్నతాధికారులను అడిగితే.. 'అదిగో ఇస్తా.. ఇదిగో ఇస్తున్నాం' అంటూ చెబుతున్నారని ఏఈఈలు వాపోతున్నారు. మొత్తంగా కొత్తగా కొలువులోకి వచ్చిన ఇంజినీర్లకు బాధ్యతలు అప్పగించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

## ● ఇప్పటి వరకు ఎన్ని కూల్చేశారు?

హైడ్రా ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, జంట జలాశయాలు ఎఫ్‌టీఎల్‌లో కట్టడాలను, పార్కు స్థలాల్లో మొత్తం 23 చోట్ల 262 నిర్మాణాలను కూల్చివేసి 111.72 ఎకరాలు స్వాధీనం చేసుకుంది. రెండు నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. వీటిలో అత్యధికంగా గాజుల రామారంలోని చింతల్ చెరువుల ఒడ్డున 54 నిర్మాణాలను కూల్చేశారు. రాజేంద్రనగర్‌లోని భూముల రక్ డౌలాలో 45 నిర్మాణాలు ఉన్నాయి. ఇదే క్రమంలో లోటస్ పాండ్, మన్సూరాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బాచుపల్లి, చందానగర్, అమీర్‌పేట, అమీన్‌పూర్, గుట్టల బేగంపేట, మల్లంపేటలలో పలు నిర్మాణాలను నేలమట్టం చేశారు.

## ● పేదవారివి ఎన్ని.. పెద్దోళ్లవి ఎన్ని?

హైడ్రా కూల్చివేతల్లో ఇరవై శాతం పెద్దలకు సంబంధించిన నిర్మాణాలు కాగా., మిగతావన్నీ పేదలకు, మధ్యతరగతి వారికి సంబంధించినవి కావడం గమనార్హం. పల్లం రాజు సోదరుడు పల్లం ఆనంద్, కావేరి సీడ్స్ అధినేత జీవీ భాస్కర్ రావు, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ రెడ్డి, ప్రొ కబడ్డీ ఓనర్ అనుపమ, సినీ నటుడు నాగార్జున, చింతల్‌లో బీఆర్ఎస్ నేత రత్నాకర్ రాజు ఉన్నారు. పటేల్‌గూడ పరిధిలోని బీఎస్ఆర్ కాలనీ పక్కన ప్రభుత్వ భూమిలో నిర్మించిన 24 ఇళ్లను కూల్చేశారు. నల్ల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 16 ఆక్రమణలంటూ రేకుల షెడ్డులను గంటల వ్యవధిలోనే నేలమట్టం చేశారు. సున్నం చెరువులో పేదల ఇళ్లను కూల్చేశారు.



*నగరంలో వినియోగదారులను దండుకోవడమే ప్రధానంగా పలు హోటళ్లు, రెస్టారెంట్లు, కెఫేలు, బిర్యానీ సెంటర్లు పని చేస్తున్నాయి. ఆహార, వినియోగదారుల భద్రతను గాలికొదిలేసి, కస్టమర్లను దోచుకోవడమే పరమావధిగా పెట్టుకొని పలు కేంద్రాలు నగర వ్యాప్తంగా నడుస్తున్నాయి. ఫుడ్ సేఫ్టీ నియమ నిబంధనలను తుంగలో తొక్కి గడువు ముగిసిన పదార్థాలు, పానీయాలను వాడుతూ వినియోగదారుల జీవితాలతో సదరు పూటకూళ్ల ఇండ్లు ఆడుకుంటున్నాయి. తినడమే వృత్తిగా పెట్టుకున్న ప్రియులారా.. జర జాగ్రత్త వహించండి. ఈ నేపథ్యంలో సేఫ్టీ అధికారులు ఆయా కేంద్రాలపై దాడులు చేశారు.*

# ఆహార ప్రియులూ.. జర పైలం!

**చైతన్యపురిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు**

**శిల్పి ఎలైట్ రెస్టారెంట్ అండ్ బార్, బహార్ బిర్యానీ కేఫ్‌పై చర్యలు**

**అడుగడుగునా నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు**

సిటీబ్యూరో, అక్టోబరు 24 (నమస్తే తెలంగాణ): నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారుల చర్యలు కొనసాగుతున్నాయి. చైతన్యపురిలో బహార్ బిర్యానీ కేఫ్‌లో అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించగా, వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహార వస్తువులకు లేబుల్స్ లేనట్లు, పచ్చి చికెన్‌ను ఫ్రిజ్‌లో డంప్ చేసినట్లు తేల్చారు. గడువు ముగిసిన పెప్పర్ సాస్, చాక్లెట్ ఫ్లేవర్, సిరప్ వంటివి సీజ్ చేసినట్లు చెప్పారు. శిల్పి ఎలైట్ రెస్టారెంట్ అండ్ బార్‌లో వంటగదిలో సీలింగ్ జిడ్డుగా ఉన్నట్లు, ఫ్రిజ్ అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. నిల్వ చేసిన ఆహార ప్యాకెట్లకు లేబుల్ లేవని తేల్చారు. వంటగదిలో టమోటాలు, బీట్ రూట్ వంటి కుళ్లిన కూరగాయలు, పరిసరాల్లో బొద్దింకలు విపరీతంగా ఉన్నట్లు గుర్తించారు. వేర్వేరుగా కాకుండా వెజ్, నాన్‌వెజ్ ఆహార పదార్థాలు ఫ్రిజ్‌లో నిల్వ ఉన్నట్లు గుర్తించారు. సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తెలిపారు.



*సగటు నగరవాసి గుండెల్లో గునపం 'హైడ్రా' (హైదరాబాద్ విపత్తుల ప్రతిస్పందన మరియు ఆస్తుల పరిరక్షణ సంస్థ). విపత్తుల నివారణ, ఆస్తుల పరిరక్షణేమో గానీ, సగటు నగరజీవి బతుకును చిన్నా భిన్నం చేసింది. హైడ్రా హైదరాబాద్ నగరానికి ఎలాంటి విపత్తులను రాకుండా చేస్తుందో, ప్రభుత్వ ఆస్తులను ఎన్ని వేల ఎకరాల్లో కూడబెడుతుందో.. తెలియదు గానీ, దేదీప్యమానంగా వెలుగుతున్న సామాన్యులు, మధ్య తరగతి వాసుల ఇంటి దీపాలను ఆర్పేసి, వారి జీవితాలను అంధకారం చేసి ఆడుకుంటుంది. ఎంతో మంది పెద్దల ఇండ్లు అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నప్పటికీ వారిపై ఎలాంటి ప్రతాపం చూపలేకపోయింది. సులభంగా దొరికిన సామాన్యుల బతుకులపై హైడ్రా గునపం దింపింది. వంద రోజుల తన ప్రయాణంలో నగరంలోని 23 ప్రాంతాల్లో 262 నిర్మాణాలను నేలమట్టం చేసింది. హైడ్రా చర్యలపై హైకోర్టు సైతం ప్రశ్నించినా.. ఎలాంటి ఉలుకూ పలుకూ లేకుండా ముందడుగు వేస్తూనే ఉంది. రోజుకో రూపంతో సామాన్యుల బతుకుల్లో నిప్పులు పోస్తూనే ఉంది.*





# హడలెత్తిస్తున్న హైడ్రా

## ఏర్పాటై రేపటికి వంద రోజులు


- 23 ప్రాంతాలు.. 262 నిర్మాణాలపై వేటు
- కూల్చివేతల్లో పెద్దోళ్ల ఇండ్ల కంటే పేదవారియే ఎక్కువ
- అనుమతులున్నా.. ఎందుకు కూల్చారు?
- రోజుకొక రూపంతో హడావిడి

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌ను హడలెత్తించిన హైడ్రా.. ఏర్పాటై రేపటికి (శనివారం) సరిగ్గా వంద రోజులు. చెరువుల విపత్తు నిర్వహణతో పాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకోసం ఏర్పాటు చేసిన హైడ్రా ఇప్పటివరకు ఓఆర్ఆర్ లోపల 262 నిర్మాణాలు కూల్చివేసింది. విపత్తు నిర్వహణ, ఆస్తుల రక్షణగా 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్' ప్రొటెక్షన్ ఏజెన్సీ హైడ్రాను ఏర్పాటు చేస్తున్నట్లు జూలైలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. జీహెచ్ఎంసీ, దాని చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 గ్రామ పంచాయతీల వరకు ఈ విభాగం పనిచేస్తున్నదని ప్రకటించారు. హైడ్రా ఏర్పాటు చేస్తున్నట్లు జీవో నం.99ను జూలై 19న ప్రభుత్వం విడుదల చేసింది. గవర్నర్ ఆర్డినెన్స్‌పై సంతకం పెట్టిన తర్వాత గెజిట్‌ను విడుదల చేయడంతో హైడ్రాకు పూర్తి అధికారాలు వచ్చినట్లయ్యింది. వందరోజుల హైడ్రా వ్యవస్థలో పెద్దల కంటే పేదల పైనే ఫోకస్ అధికం చేసి వారి ఇళ్లపైకే బుల్డోజర్లు పంపడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కోర్టు సైతం హైడ్రా కమిషనర్‌ను ఈ విషయంలో సీరియస్‌గా ప్రశ్నించిన పరిస్థితి చూశాం. 'కనీసం నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చేస్తారు?' అని న్యాయస్థానం ప్రశ్నించింది. హైడ్రా 100 రోజుల పరిణామాల్ని చూద్దాం..



### ఉన్నవి రెండు కమిటీలు.. భట్టినే హైడ్రా బాస్!

హైడ్రా కమిటీకి చైర్మన్‌గా సీఎం రేవంత్ రెడ్డితో పురపాలక, రెవెన్యూ శాఖల మంత్రులు, గ్రేటర్ పరిధిలోని జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, జీహెచ్ఎంసీ మేయర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, రెవెన్యూ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శులు, సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం అధిపతి సభ్యులుగా ప్రధానమైన పాలక మండలి ఉంటుంది. విధానపరమైన నిర్ణయాలపై ఈ కమిటీ మార్గ నిర్దేశనం, సమీక్షలు చేస్తుంది. తెలంగాణ కోర్ అర్బన్ రిజియన్(టీసీయూఆర్) పరిధిలోని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ రెండో కమిటీగా పనిచేస్తుంది. దీనికి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, ఇతర శాఖలు, విభాగాల ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ రెండు కమిటీల్లో హైడ్రా కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, వివిధ విభాగాల నుంచి ప్రత్యేక బృందాలు హైడ్రాలో పని చేస్తాయి. హైడ్రాకు విస్తృత అధికారాలు కల్పిస్తూ రాష్ట్ర సర్కార్ తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు అక్టోబర్ 5న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఐతే, హైడ్రా నిర్వహణకు సంబంధించి రెండు కమిటీలున్నా.. మొత్తం నిర్వహణ విషయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కనే బాస్‌గా వ్యవహరిస్తున్నారు.



నగరవాసి గుండెల్లో గునపం

### ● అనుమతులు ఉన్నవి ఎన్ని..?

అనుమతులుంటే కూల్చేయమంటూ సీఎం రేవంత్‌తో పాటు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించినప్పటికీ.. అంతకు ముందే హైడ్రా కూల్చివేతల్లో అనుమతులున్న భవనాలపై జవాబుదారీ ఎవరు? అనే ప్రశ్న తలెత్తుతోంది. శేరి లింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ హఫీజ్‌పేట డివిజన్ మదీనాగూడలోని సర్వే నం.26లో ఈర్ల చెరువు బఫర్ జోన్‌లో ఉన్నారంటూ ఆగస్ట్ 19న భవనాలను కూల్చేశారు. తమకు అనుమతులున్నాయని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఉందంటూ భవన యజమానులు చెప్పినా హైడ్రా వినకుండా కూల్చేసింది. మదీనాగూడలోని ఎర్ల చెరువులో కూడా కొన్ని నిర్మాణాలకు అనుమతులిచ్చారు. అయితే, కొన్నిచోట్ల అనుమతులిచ్చిన అధికారులపై ఫిర్యాదులు చేసి కేసులు పెట్టించడం వరకు హైడ్రా ఆలోచించింది తప్ప, ఆ నిర్మాణాల కూల్చివేతలతో మధ్యతరగతి, పేదవారు పూర్తిగా నష్టపోతున్నారని తెలిసీ దూకుడుగా వ్యవహరించింది.

### ● ఏ అధికారాలు బదలాయించారు..

జీహెచ్ఎంసీ పరిధిలోని రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ బాడీలు, పబ్లిక్ ప్లేసెస్, పార్కులు తదితర ప్రభుత్వ, జీహెచ్ఎంసీ ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా రక్షించడానికి హైడ్రాకు అధికారం కల్పించింది. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి ఆక్రమణలను పరిశీలించడం, నోటీసులివ్వడం, ప్రభుత్వ స్థలాల్లోని ఆక్రమణల తొలగింపునకు అధికారం కల్పించే జీహెచ్ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 374బీని హైడ్రా అధికారాలుగా చేరుస్తూ గవర్నర్ ఇచ్చిన ఆర్డినెన్స్‌కు పొడిగింపుగా, ఈ గెజిట్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. జీవోపై కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ హైడ్రాకు విశేష అధికారాలొచ్చాయని, ఇకపై అక్రమ నిర్మాణాల కూల్చివేతకు నోటీసులిస్తుందన్నారు. అదే విధంగా అనధికారిక భవనాలకు సీజ్ చేసే అధికారం కూడా హైడ్రాకు ఉందన్నారు.

### ● సీజ్ చేసింది జీహెచ్ఎంసీ.. హైడ్రా ఏం చేస్తోంది?

హైడ్రా తన అధికారాల్లో అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్న ఇండ్లకు, భవనాలకు నోటీసులు ఇస్తామని, అనధికారిక భవనాలను సీజ్ చేస్తామని చెప్పారు. కానీ, వనస్థలిపురం పరిధిలోని సాగర్ కాంప్లెక్స్, బీఎన్‌రెడ్డి నగర్ చౌరస్తాలో, సచివాలయనగర్‌లోని భవనాలను జీహెచ్ఎంసీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. అయితే, అనధికారిక భవనాలను సీజ్ చేసే అధికారం తమదేనన్న హైడ్రా ఈ విషయంలో ఎందుకు మాట్లాడటం లేదు. జీహెచ్ఎంసీ అధికారాల బదలాయింపు తర్వాత సీజ్ చేయడం, నోటీసులు జారీ చేయడం వంటి అధికారాలు కలిగిన హైడ్రా ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేయలేకపోవడానికి కారణాలేంటి? గతంలో పనిచేసిన కమిషనర్‌తో పాటు ప్రస్తుతం కమిషనర్‌తోనూ హైడ్రా కమిషనర్‌కు కొంత విభేదాలున్నట్లు తెలుస్తోంది.

### ● రోజుకో రూపంలో.. హడావిడి

హైడ్రా అంటే అనేక తలల జంతువు అన్నట్లుగా హైడ్రా వ్యవస్థ కూడా రోజుకొక రూపంలో హడావిడి చేస్తోంది. కూల్చివేతల నుంచి చెరువుల సుందరీకరణ, నగరంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్.. ఇలా రెండు రోజులు సమీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత ఒక ఎన్జీవోతో బెంగళూరు టూర్ ప్లాన్ చేశారు. అటు నుంచి హైడ్రా గ్రేటర్‌లో ట్రాఫిక్‌పై దృష్టి పెట్టింది. ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్‌తో కలిసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై సమీక్ష నిర్వహించింది. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ వారితో రెండు రోజులు గ్రేటర్‌లో వాటర్ లాగింగ్ పాయింట్స్ ఎక్కడ ఉన్నాయంటూ రాజ్ భవన్ రోడ్డు, లక్డీకాపూల్‌లో హడావిడి చేశారు. అటు నుంచి వృక్షాల పరిరక్షణకు అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు.

# టీచర్ల భర్తీపై మెజిస్ట్రేట్‌తో విచారణ

నమస్తే ఎఫెక్ట్

**ఖాళీలకు అనుగుణంగా భర్తీ కాని టీచర్లు**

**విద్యా శాఖ నిర్లక్ష్యంపై నమస్తే తెలంగాణ కథనం**

- స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌తో విచారణకు కలెక్టర్ ఆదేశం
- డీఈఓ, డిప్యూటీ ఈఓ, డిప్యూటీ ఐఓఎస్‌ల నుంచి వివరణ రికార్డు
- రెండు రోజుల్లో శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ సిద్ధం
- లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారంటూ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం!

సిటీబ్యూరో, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): 'దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుంది.' మన దేశ భవిష్యత్తును నిర్ణయించే విద్యార్థులకు అన్ని మౌలిక వసతులతో కూడిన బోధన అందాలనేదే విద్యావేత్తల ఆకాంక్ష. ఈ లక్ష్యంతోనే అధికారులు పనిచేస్తే గొప్ప ఫలితాలు సాధించొచ్చు. కానీ, హైదరాబాద్ విద్యా వ్యవస్థలో ఈ దిశగా అడుగులు పడటం లేదు. డీఎస్సీ-2024 టీచర్ల భర్తీలో అవకతవకలు జరగడమే ఇందుకు ఉదాహరణ. అవసరమున్న చోట టీచర్లను కేటాయించకుండా.. అవసరం లేని చోట టీచర్లను కేటాయించడం ఏంటి? అని 'నమస్తే తెలంగాణ' రెండు రోజులుగా కథనాలు ప్రచురించింది. ఈ కథనంపై స్పందించిన కలెక్టర్ ఒక కమిటీ ఏర్పాటు చేసి టీచర్ల భర్తీపై వివరాలు సేకరించాలని ఆదేశాలిచ్చారు. అయితే, అందులో చాలా మంది డిప్యూటీ ఈఓ, డిప్యూటీ ఐఓఎస్‌లు ఉండటంతో గురువారం స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్(ఎస్ఈఎం)తో విచారణ జరిపించేందుకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో సదరు ఎస్ఈఎం ఆధ్వర్యంలో ఎనిమిది మంది విద్యా శాఖాధికారుల వివరణను రికార్డు చేశారు. ఖాళీలు ఎందుకు చూపించలేదు? అవసరం లేని పాఠశాలలకు టీచర్లను ఎందుకు కేటాయించారు? ఎవ్వరైనా చెప్పారా? డీఈఓ ఆదేశాలు ఉన్నాయా? ఖాళీలు ఎక్కడెక్కడ ఉన్నాయి? ముందే ఎందుకు ఆ మేరకు కసరత్తు చేయలేదు? తదితర ప్రశ్నలకు సమాధానం రాబట్టారు. కాగా, టీచర్ల భర్తీలో డిప్యూటీ ఈఓ, డిప్యూటీ ఐఓఎస్‌లను పర్యవేక్షించాల్సిన డీఈఓ రోహిణీ వివరణను కూడా ఎస్ఈఎం రికార్డు చేసినట్టు సమాచారం.

### అంత నిర్లక్ష్యం ఎందుకు?

హైదరాబాద్‌లో డీఎస్సీ 2024లో 584 మంది అభ్యర్థులకు పోస్టింగ్ ఇచ్చారు. 878 పోస్టులకు గాను కోర్టు కేసులు, రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థుల కొరత, ఇన్ సర్వీస్ తదితర కారణాలతో 262 పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయి. మిగతా 616 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్‌తో 32 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు నిలిపివేసిన విషయం తెలిసిందే. నియామక పత్రాలు అందుకున్న వారిలో 386 ఎస్జీటీ, 107 ఎస్ఏ, 91 ఎల్‌పీ అభ్యర్థులకు పోస్టింగులు లభించాయి. వీరిని అవసరమున్న చోట భర్తీ చేయకుండా ఇష్టానుసారంగా ప్రక్రియ పూర్తి చేశారు. ఇప్పుడు ఈ తతంగానికి బాధ్యులెవ్వరు? అని 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం ప్రచురించడంతో కలెక్టర్ స్పందించి విచారణకు ఆదేశించారు. రెండు రోజుల్లో బాధ్యులపై శాఖాపరమైన చర్యలు ఉండనున్నాయి.

# అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన

**ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్**



డా. బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

బంజారాహిల్స్, అక్టోబర్ 24: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించిన 10 ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కేటాయించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనను వ్యతిరేకిస్తూ ఉద్యోగుల ఆందోళన ముమ్మరంగా కొనసాగుతోంది. గురువారం మధ్యాహ్నం యూనివర్సిటీకి చెందిన అధ్యాపక, అధ్యాపకేతర, టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్, టైం స్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులంతా మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ. పల్లవి కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జి.మహేశ్వర్ గౌడ్, జేఏసీ నేతలు డా.యాకేశ్ దైద, కే.ప్రేమ్ కుమార్, రవీంద్రనాథ్ సోలమన్, డా. ఎల్‌కేవీ రెడ్డి, హబీబుద్దీన్, రజినీకాంత్, నారాయణరావు పాల్గొన్నారు.

# సీపీ ఆఫీసులో మేజిస్ట్రేట్ కోర్టు

- సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ నిర్వహణ
- నాంపల్లిలో ఎంఐఎం, కాంగ్రెస్ వర్గాల మధ్య జరిగిన గొడవపై వాదనలు
- వాదనలు విన్న మేజిస్ట్రేట్.. కేసు వాయిదా

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): నాంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, అతనిపై పోటీ చేసి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్ వర్గాల మధ్య ఇటీవల చోటు చేసుకున్న వివాదాన్ని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ (ఎగ్జిక్యూటివ్) హోదాలో గురువారం బంజారాహిల్స్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో కార్యనిర్వాహక న్యాయస్థానాన్ని నిర్వహించారు. హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై స్టేషన్ హౌస్ ఆఫీసర్ కోర్టు ముందు రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ సమాచారాన్ని వివరించారు. నియోజకవర్గంలో ఇరువురి మధ్య ఆధిపత్యాన్ని సాధించేందుకు రాజకీయ పరంగా పోటీ ఉందని చెప్పారు. ఈ నెల 7న ఫిరోజ్ గాంధీ నగర్‌లో సీసీ రోడ్డు పనులు తనిఖీ చేసేందుకు ఎంఐఎం పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ మాజిద్ హుస్సేన్ అక్కడకు తన అనుచరులతో వచ్చాడు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫిరోజ్‌ఖాన్ కూడా తన అనుచరులతో రోడ్డు పనులు తనిఖీ చేసేందుకు అక్కడకు వచ్చాడు. ఈ సందర్భంగా మాజిద్ హుస్సేన్ అనుచరులు సీసీ రోడ్డు పనులకు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుందన్నారు. ఆ ఘటనతో రెండు గ్రూపుల అనుచరలతో ప్రజల్లో భయాందోళనలు కల్గించడమే కాకుండా స్థానికంగా శాంతి భద్రతలకు విఘాతం కల్గించే విధంగా ఉన్నాయన్నారు. పోలీసులు జోక్యం చేసుకొని ఇరుపక్షాల కార్యకర్తలను చెదరగొట్టి, పరస్పరం వచ్చిన ఫిర్యాదులపై రెండు వర్గాలపై కేసు నమోదు చేశామన్నారు.

### ఇరు వర్గాల ఆధిపత్య పోరుతో..

ఇరువర్గాల మధ్యనున్న ఆధిపత్య పోరుతో హుమాయూన్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధితో పాటు పరిసర ప్రాంతాలలో శాంతి భద్రతలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఇరువురిని కొంత కాలం పాటు నిర్బంధించాలని కోర్టును అభ్యర్థించాడు. దీంతో మాజిద్ హుస్సేన్‌తో పాటు అతని అనుచరులు 10 మంది, ఫిరోజ్‌ఖాన్ అతని తొమ్మిది మంది అనుచరులతో ఇరువర్గాలు కోర్టు ముందు హాజరై వాదనలు వినిపించారు. వాదనలు విన్న మేజిస్ట్రేట్ అలాంటి రెచ్చగొట్టే కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఇరువర్గాలకు సూచిస్తూ, కేసు విచారణను వాయిదా వేశారు. కాగా, సెక్షన్ 126 బీఎన్ఎస్ఎస్, 2023 (సెక్షన్ 107 సీఆర్‌పీసీ) ప్రకారం, వ్యక్తి లేదా సమూహాలలో ఒకరు, అంత కంటే ఎక్కువ మంది ఉండి ప్రశాంతతకు భంగం కల్గించే చర్యలకు పాల్పడే అవకాశం ఉంటే నిర్ణీత వ్యవధిలో శాంతిని నెలకొల్పడానికి ఇరువర్గాల నుంచి ప్రశాంతతను కాపాడుతామని ఎగ్జిక్యూటివ్ బాండ్‌ను ఇవ్వాలని ఆదేశించడం జరుగుతుంది.



ఇరు వర్గాల వాదనలో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులు